క్లుప్తంగా

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కోసిగి: మండల కేంద్రంలో సిద్దప్ప పాలెం కమ్మరి వీధిలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి సహకారంతో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయిస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు జగదీష్ స్వామి తెలిపారు. బుధవారం కోసిగిలో వైఎస్సార్ సర్కిల్ నుంచి కమ్మరి వీధి మీదుగా బస్టాండ్ వరకు ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ ఆధ్వర్యంలో స్తంభాల ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోసిగిలో అవసరం నిమిత్తం కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు కమ్మరి కాలనీవాసులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించాలని విన్నవించారు. ఆయన ఆదేశాలతో విద్యుత్ అధికారులు స్తంభాలు పాతి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించారు. దీంతో ఆ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి


గాయపడిన భాగ్యలక్ష్మి

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణంలోని శివశంకర్ నగర్‌లో భార్య తన మాట వినలేదనే ఆవేశంతో భర్త కత్తితో దాడి చేశాడు. బాధితులు టూటౌన్ పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో నివశిస్తున్న మనోహర్ భార్య భాగ్యలక్ష్మి తన మాట వినలేదని బుధవారం భార్యపై కత్తితో దాడి చేశాడు. అడ్డుకోవడానికి వెళ్లిన అత్త గంగమ్మకు కూడా కత్తి తగిలడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఇరుగుపొరుగువారు వారిని ప్రభుత్వ ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మధ్యాహ్న భోజనం భేష్


నదిచాగి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: నదిచాగి గ్రామంలోని కన్నడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి బాగుందని, రోజూ ఇలాగే వడ్డించాలని ఎంపీడీఓ సుబ్బరాజు వంట సిబ్బందికి సూచించారు. ఆయన బుధవారం నదిచాగి గ్రామంలోని కన్నడ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. నాడు–నేడు కింద పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యద,ర్శి శివప్ప, గ్రామ ఇన్‌చార్జ్ రామన్నగౌడ్, ఎంపీటీసీ లింగన్నగౌడ్, ప్రధానోపాధ్యాయుడు గురురాజశెట్టి ఉన్నారు.

ఉపాధి కూలీల ధర్నా

ఆదోనిరూరల్: ఉపాధి సమస్యలను పరిష్కరించాలని కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని, కూలీలను ఆధార్‌తో అనుసంధానం చేయరాదని, వారం వారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు. నాయకులు రామాంజనేయులు, బి.తిక్కప్ప, శ్రీనివాసులు, ఈరన్న, రహీం ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

దళిత ముద్దుబిడ్డ శివలింగమ్మ


శివలింగమ్మను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలలో చదివి సత్తా చాటుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశంతో ఐక్యరాజ్య సమితి, వరల్డ్ బ్యాంక్, అమెరికా అధ్యక్ష సౌధం సందర్శించి తిరిగివచ్చిన పొదలకుంట గ్రామానికి చెందిన విద్యార్థిని శివలింగమ్మ దళిత ముద్దుబిడ్డ అని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. కౌతాళంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం విద్యార్థిని శివలింగమ్మను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజబాబు మాట్లాడుతూ.. కౌతాళం మండలం పేరును దేశ విదేశాల్లో గుర్తించేలా పేరు తెచ్చిన శివలింగమ్మ దళిత బిడ్డ కావడం గర్వకారణమన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూలమాల శాలువాతో సన్మానించారు. ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు ఉరుకుంద సురేంద్ర, ఎంఎస్పీ మండలాధ్యక్షుడు ఆనంద్, దళిత సమైక్య సభ్యుడు ముఖేష్, ప్రధాన కార్యదర్శులు శేఖర్, రామాంజనేయులు, బంటకుంట రంగప్ప పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

మంత్రాలయం: బాలికలు క్రీడల్లోనూ రాణించాలని శ్రీమఠం పరిమళ విద్యానికేతన్ ఇన్‌చార్జ్ హెచ్ఎం వనశ్రీ పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 వాలీబాల్ క్రీడల్లో పాఠశాలకు చెందిన క్రీడాకారిణి జ్ఞాన ప్రజ్ఞ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరించింది. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రభుత్వం నుంచి మంజూరైన ప్రశంసా పత్రాన్ని బుధవారం విద్యార్థినికి అందజేసి అభినందించారు. పీఈటీ వెంకటేష్ ఉన్నారు.


నదిచాగిలో ఆయుష్మాన్ కార్డుల పంపిణీ


నదిచాగి శిబిరానికి హాజరైన ప్రజలు


మండిగిరి శిబిరానికి హాజరైన ఆరోగ్య సిబ్బంది, ప్రజలు


పౌష్టికాహార స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గీతావాణి

ప్రజారోగ్యమే జగనన్న సురక్ష ధ్యేయం

- మండిగిరిలో జగనన్న వైద్య శిబిరానికి విశేష స్పందన
- వెయ్యి మందికి పైగా వైద్య పరీక్షలు


మాలపల్లిలో బీపీ, రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


డి.బెళగల్ గ్రామంలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

ఆదోనిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. ఈ మేరకు బుధవారం మేజర్ గ్రామ పంచాయతీ మండిగిరి సచివాలయం–2 పరిధిలోని మల్లికార్జున స్కూల్ ఆవరణలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఇమ్రాన్‌అహ్మద్, షఫీకర్, సుస్మిత, కీర్తిప్రియ పాల్గొని 1001 మందిని పరీక్షించారు. 83 మందికి కంటి పరీక్షలు చేసి 61 మందికి కళ్లద్దాలను ఉచితంగా అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీడీఓ పరిశీలించారు. ప్రజలు పౌష్టికాహారమైన ఆకుకూరలు, పప్పు దినుసులు తదితర వాటిని నిత్యం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కల్లుపోతుల సురేష్, నాయకులు కోటిరెడ్డి, ఈఓపీఆర్డీ నాగరాజు, వీఆర్వో రాజశేఖర్ గౌడ్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం: మండలంలోని మాలపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 461 మందికి వైద్య పరీక్షలు చేశారు. అందులో పురుషులు 257, మహిళలు 204 మంది ఉన్నారు. 42 మందికి కంటి పరీక్షలు, 37 మంది గర్భిణులు, 42 మంది చిన్నారులు, విద్యార్థులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ సీతారామిరెడ్డి, ఎంపీడీఓ మణిమంజరి, వైద్యులు భావన, వసంత, వంశీ గౌతమ్, ప్రతాప్, సంగీత రోగులకు చికిత్స అందించారు.

కౌతాళం: ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి తక్షణ ఆరోగ్య సేవలు అందించడానికి చేపట్టిన కార్యక్రమమే జగనన్న ఆరోగ్య సురక్ష అని నదిచాగి గ్రామ ఇన్‌చార్జి రామన్నగౌడ్, ఎంపీటీసీ లింగన్నగౌడ్, ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో బుధవారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ప్రతి ఇంటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్సతో పాటు మందులను ఉచితంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.అత్యవసర చికిత్స అవసరమైన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తారన్నారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేసి పౌష్టికాహారం గురించి వివరించారు. అనంతరం ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. డాక్టర్ ఇమ్మానుయేల్, కార్యదర్శిశివప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 300 మంది ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగరు, రక్త తదితర పరీక్షలు చేయించుకొని వ్యాధులకు సంబంధించి ఉచితంగా మందులను తీసుకున్నారు. డాక్టర్లు నీలోఫర్‌భాను, సహనాజ్ మాట్లాడుతూ.. చికిత్సలు పొందిన వారు వైద్యుల సూచనల మేరకు సకాలంలో మందులు వేసుకోవాలని సూచించారు. తహసీల్దారు వీరేంద్రగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామ సచివాలయం పరిధిలోని దొడ్డి బెళగల్ గ్రామ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. బుధవారం డి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ పద్మమ్మ ఆధ్వర్యంలో ఈఓపీఆర్డీ అరూన్ రషీద్, డాక్టర్ అనురూప్ సమక్షంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు వీరన్న గౌడ, రవి గౌడ, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యుడు మల్లికార్జున గౌడ శిబిరాన్ని ప్రారంభించారు. ఆ సచివాలయం పరిధిలో వివిధ వ్యాధులతో పడుతున్న వారు ఓపీ ద్వారా 382 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రధానంగా రక్త పరీక్ష, డయాబెటిస్, మలేరియా, హెచ్‌బీ, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. మెరుగైన చికిత్స అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ ద్వారా కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు నజీర్ అహ్మద్, రజిత,, చిన్న పిల్లల డాక్టర్ అఫీస్ అహ్మద్, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


డి.బెళగల్ శిబిరానికి హాజరైన ప్రజలు

కాళ్ల నొప్పులకు మందులు ఇచ్చారు



గ్రామంలో రెండు రోజుల క్రితం ఏఎన్ఎం, వలంటీర్ మా ఇంటికి వచ్చి నా ఆరోగ్యం గురించి వాకబు చేశారు. జ్వరం, కాళ్ల నొప్పులు ఉన్నాయని సమాధానం చెప్పాను. వారు చెప్పినట్లు వైద్య శిబిరానికి రాగా పెద్ద డాక్టర్లు బీపీ చెక్ చేసి కాళ్ల నొప్పులకు మందులు ఇచ్చారు. గ్రామంలోనే డాక్టర్లు వైద్యం అందించడం చాలా సంతోషంగా ఉంది.

– లక్ష్మీ, డి.బెళగల్

కంటి పరీక్ష చేయించుకున్నాను



కొద్ది రోజులుగా వయస్సు పైబడడంతో కళ్లు మసకగా కనిపిస్తున్నాయి. ఏఎన్ఎం మా ఇంటికి వచ్చి ఆరోగ్యంపై వాకబు చేయగా సమస్యను చెప్పాను. వైద్య శిబిరంలో కంటి డాక్టర్లు వస్తారు. చెక్ చేసుకోమని చెప్పారు. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకున్నాను. కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు.

– చిన్న మాదప్ప, డి.బెళగల్

నేటి వైద్య శిబిరాల షెడ్యూల్


వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం, ఆశావర్కర్లు

మండలం	గ్రామం	ప్రదేశం
ఆదోని	నాగలాపురం	గ్రామ సచివాలయం
కోసిగి	పెద్దబొమ్మపల్లి	ప్రాథమిక పాఠశాల
కౌతాళం	గుడికంబాల	గ్రామ సచివాలయం
మంత్రాలయం	వగరూరు	విలేజ్ క్లినిక్

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగానే ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని గుర్తిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే వైద్య శిబిరాల్లో మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచిస్తూ టోకెన్లు అందిస్తున్నారు. ఏయే వ్యాధులకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుందో కార్డును ఎలా ఉపయోగించుకోవాలో వంటి అంశాలను వివరిస్తున్నారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో గురువారం జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్‌ను అధికారులు వెల్లడించారు.

ఎల్ఎల్‌సీకి మార్చి వరకు నీరివ్వాలి

ఆదోని సెంట్రల్: తుంగభద్ర డ్యాం నుంచి మార్చి వరకు నీటిని అందించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, ఖాజ తెలిపారు. బుధవారం పట్టణంలోని తుంగభద్ర కార్యలయం ముందు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఎల్ఎల్‌సీ కాలువ కింద దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారని తెలిపారు. డ్యాం అధికారులు నవంబర్ 10 వరకే సాగునీరు అందిస్తామని చెప్పడం సరికాదన్నారు .వెనుకబడిన ప్రాంతమైన ఆలూరు, ఆదోని, కోడుమూరు వంటి ప్రాంతాలు సాగు, తాగునీటికి ఎల్ఎల్‌సీ కాలువపైనే అధారపడ్డాయని పేర్కొన్నారు. అధికారులు, పాలకులు స్పందించి కాలువ ద్వారా మార్చి వరకు సాగునీటిని అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్ఏవీఎఫ్ నాయకులు వెంకటరాముడు, రవీంద్ర, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మంత్రాలయం: శ్రీమఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరిమళ విద్యానికేతన్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. త్రోబాల్ అండర్–17 విభాగంలో బి.పరిమళ, అండర్–14 విభాగంలో వై.స్వాతి ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. సదరు విద్యార్థులను, పీఈటీ వెంకటేష్‌ను హెచ్ఎం చంద్రశేఖర్ అభినందించారు.

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అక్షరశ్రీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ మేఘనాథ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. బాస్కెట్‌బాల్ అండర్–17/బి విభాగంలో రిహాన్ అండర్–14/బి విభాగంలో హర్షకిరణ్ రెడ్డి, బాస్కెట్‌బాల్ అండర్–14/జి విభాగంలో నిత్యరెడ్డి, రుఖియ్య, ప్రణతి ఎంపికైనట్లు తెలిపారు. నెట్‌బాల్ పోటీల్లో అండర్ 17/బి విభాగంలో రామ్‌చరణ్‌రెడ్డి, ముజ్జామ్మిల్ కబడ్డీ అండర్–14/జి విభాగంలో మీనా ఎంపికయినట్లు తెలిపారు. పాఠశాల నుంచి 7 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి


ఏరిగేరి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కౌతాళం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ లాలికృష్ణయ్య, ఎంపీడీఓ సుబ్బారాజు ఆదేశించారు. వారు బుధవారం మండల పరిధిలోని ఏరిగేరి గ్రామ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సూచనలు చేశారు. లేఅవుట్‌లో 177 మందికి ఇళ్లు మంజూరయ్యాయని, వీరిలో 74 మందికి అకౌంట్స్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. ఇంకా 103 మంది లబ్ధిదారులు ఖాతా ప్రారంభించాల్సి ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ నూర్‌బాషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ తులసి ఉన్నారు.

తప్పిపోయిన బాలుడు పోలీసుల చెంతకు..


బాలుడు బాలాజీ

ఆదోనిఅర్బన్: అనంతపురం నుంచి తల్లితో బస్సులో ప్రయాణం చేసిన బాలుడు బాలాజీ ఆదోని బస్టాండులో తప్పిపోయి తమ చెంతకు చేరాడని టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. బాలుడు తెలిపిన వివరాలను ఆయన విలేకరులకు వివరించారు. బాలుడు బాలాజీ కుటుంబీకులది ఆదోని పట్టణంలోని వైఎస్సార్ నగర్ అని, శిశుమందిర్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడని, నాన్న పేరు విజయ్‌కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. అలాగే తల్లి పేరు లక్ష్మి అని, అక్క పేరు మానస ఏడో తరగతి చదువుతోందని, వారిని గాజుల వాళ్లు అని అంటారని తెలిపాడు. తన తల్లి లక్ష్మితో పాటు బుధవారం అనంతపురం బస్సులో ఆదోనికి చేరుకున్నాడని సీఐ చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

15 నుంచి రంగనాథ స్వామి ఉత్సవాలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి వారిని ప్రతిరోజు ఒక్కో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం తూర్పుపేట గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 23వతేదీ మహాపూజతో పాటు శమీపూజ, దసరా ఉత్సవాలు ఉంటాయని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హొళగుంద: అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని బుధవారం కర్నూలు నుంచి వచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. విజిలెన్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ హనుమంతయ్య, తహసీల్దార్ వెంకటనారాయణ, హొళగుంద తహసీల్దారు హుసేన్‌సాహేబ్, సిబ్బంది మార్లమడికి రోడ్డులో తనిఖీలు చేపట్టగా రెండు వాహనాల్లో అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ మేరకు నిందితులు గొల్ల రాజశేఖర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి 126 బస్తాలు (73 క్వింటాళ్లు) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న రెండు ఆటోలను సీజ్ చేశారు.

రిపేరీ పేరుతో పీపీ యూనిట్ బంద్

- కు.ని. ఆపరేషన్ల కోసం బాలింతల అవస్థలు
- వెయిటింగ్‌లో 500 కేసులు


ఆపరేషన్ థియేటర్‌లో ఫ్లోర్ పనులు చేస్తున్న దృశ్యం


గోడ టైల్స్ పడిపోయిన దృశ్యం

ఆదోనిటౌన్: చిన్నపాటి రిపేర్‌లకు ఏకంగా పీపీ యూనిట్‌ను బంద్ చేశారు. దీంతో కు.ని. ఆపరేషన్ల కోసం బాలింతలు అవస్థలు పడుతూ ఆదోని ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దాదాపు 500 కేసులు వెయిటింగ్‌లో ఉన్నట్లు ఆస్పత్రి వర్గాల సమాచారం. ఆదోని పట్టణంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం ఆవరణలోని పీపీ యూనిట్ (కుటుంబ నియంత్రణ ఆపరేషన్ యూనిట్)లో ఆపరేషన్ థియేటర్‌లో గోడకు సంబంధించి కొన్ని టైల్స్ ఊడిపడ్డాయి. అలాగే ఫ్లోర్ టైల్స్ పగిలిపోయాయి. ఈ మరమ్మతు పనులు చేసేందుకు ఒకటి రెండు రోజులు సరిపోతుంది. అయితే రిపేరీ పేరుతో గత నెల 16వ తేదీన సెంటర్‌ను మూసివేశారు. ఫలితంగా ఆదోని డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బాలింతలు ఆపరేషన్ల కోసం రాగా నిరాశకు గురవుతూ వెనుదిరుగుతున్నారు. డాక్టర్లు, సంబంధిత అధికారులపై విమర్శలు చేస్తున్నారు. అలాగే పీపీ యూనిట్‌లో ల్యాబ్ టెక్నీషియన్, థియేటర్ అసిస్టెంట్ పోస్టులు చాలాకాలంగా ఖాళీగా ఉన్నాయి. దీంతో బాలింతలు అవసరమైన పరీక్షలు చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రయివేట్ క్లీనిక్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతు పనులు మొదలు పెట్టారు



పీపీ యూనిట్‌లో మరమ్మతులు చేస్తుండడం వల్ల ఆ విభాగం మూతపడింది. పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. యూనిట్ మూతబడి దాదాపు నెల కావొస్తోంది. ఈ రోజే పనులు ప్రారంభించారు. వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయిస్తాం. పీపీ యూనిట్ మూతబడడం వల్ల డివిజన్ పరిధిలోని ఆలూరు, పత్తికొండ తదితర గ్రామాల బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. వారికి సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. మరో వారం రోజుల్లోగా ఆపరేషన్లు ప్రారంభిస్తాం.

– డాక్టర్ గియాజ్, పీపీ యూనిట్

ప్రాచీన కట్టడాలను కాపాడుకుందాం


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: ప్రాచీన కట్టడాలను కాపాడుకుందామని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో రెవెన్యూ, సర్వే, మున్సిపల్, ఆర్కియాలజీ, షాహి జామియా మసీదు పెద్దలతో మసీదు పరిసరాల్లో జరుగుతున్న కట్టడాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 500 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రాచీన కట్టడాలైన మసీదును అందరం కలిసి కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, మసీదు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న కట్టడాలపై రెవెన్యూ, సర్వే, మున్సిపల్ అధికారులతో కలిసి ప్రాథమిక విచారణ చేపట్టి నివేదికలు ఉన్నతాధికారులకు పంపాలన్నారు. డీటీ రజనీకాంత్ రెడ్డి, మండల సర్వేయర్ రమణ, మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, షాహి జామియా మసీదు పెద్దలు సాదీరావూఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


కుమ్మరిగేరి వీధిలో వృద్ధురాలికి నమస్కరిస్తూ సమస్యలను తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోనిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్ చైర్మన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పదో వార్డులో రెండో రోజూ బుధవారం కుమ్మరిగేరి ఏరియాలో పర్యటించారు. 350 గృహాలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా, ఎవరైనా పథకాలు రాని వారు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని కోరారు. ఏదైనా సమస్య ఉంటే నిర్భయంగా చెప్పాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి శ్రీలక్ష్మి, నాయకులు సన్నీ, తాయన్న, చిరంజీవి, రామాంజనేయులు, రైల్వే ఈరన్న, గోపాల్, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, తాయన్న పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామానికి చెందిన హుసేన్‌బాష ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు బుధవారం కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగి అపస్మరక స్థితికి చేరాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

కుటుంబ కలహాలతో మహిళ..

మండల పరిదిలోని దుద్ది గ్రామానికి చెందిన మహాలక్ష్మి అనే మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నంకు పాల్పడింది. బుధవారం ఉదయం పొలం పనులకు వెళ్లి కుటుంబ కలహాల వల్ల పొలంలో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. గమనించిన చుట్టుపక్కల రైతులు కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్య కోసం ఆదోని తరలించారు.

విష ప్రభావంతో అస్వస్థత

మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన మునిస్వామి తన పొలంలో మందు పిచికారీ చేస్తూ విష ప్రభావంతో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కోసిగికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలి


గణేకల్ సబ్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న రైతులు

ఆదోనిరూరల్: వ్యవసాయానికి తొమ్మిది గంటల నిరంతర విద్యుత్ ఇవ్వాలని కోరుతూ రైతులు బుధవారం గణేకల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి బి.వీరారెడ్డి మాట్లాడుతూ.. ఓపక్క వర్షాలు లేక పంటలు ఎండిపోతుంటే వ్యవసాయ విద్యుత్ కోతలు విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు చేతికొచ్చే దశలో రైతులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా వ్యవసాయ విద్యుత్ సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. రైతు సంఘం మండల నాయకులు హనుమంత రెడ్డి, డీవైఎఫ్ఐ నాయకులు చింరజీవి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ–కేవైసీ చేయించుకోవాలి


ఈ–కేవైసీ వివరాలు తెలుసుకుంటున్న జేడీఏ లలితవరలక్ష్మీ

ఎమ్మిగనూరురూరల్: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి లలితవరలక్ష్మీ సూచించారు. ఆమె బుధవారం కడిమెట్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆర్‌బీకేలో రికార్డులు, పంటల నమోదు, స్టాక్‌పై వీఏఏలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు ఈ–క్రాప్‌తో పాటు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తించవని చెప్పారు. రబీ పంటల సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. పత్తి, వేరుశనగ, మిరప పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనలు పాటించి మందులను వాడాలని చెప్పారు. రసాయన ఎరువులు పరిమితికి మించి వాడరాదని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ మహేశ్వరరెడ్డి, వీఏఏలు తదితరులు ఉన్నారు.